అర్హులందరికీ సంక్షేమ పథకాలు



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న కోట నీలిమ

సనత్‌నగర్: నియోజకవర్గంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ తెలిపారు. బేగంపేట డివిజన్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీ జెండాను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించడంలో విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, అర్హులను గుర్తించి పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందన్నారు.

‘మంత్రి వర్గంలో బీసీలకు అన్యాయం’

ఉస్మానియా యూనివర్సిటీ: కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ మంత్రి వర్గంలో బీసీ వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలకు తీరని అన్యాయం జరిగిందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లేపల్లి స్వామిగౌడ్ పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ రాజ్యం అంటే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందనుకున్నాం కానీ.. 7 శాతం గల ఆధిక్య కులాలకు 7 మంత్రి పదవులను కట్టబెట్టి 60 శాతం జనాబా గల బీసీలకు కేవలం 2 పదవులను మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. తర్వాత పూర్తిస్థాయిలో ఏర్పడే మంత్రి వర్గంలోనైనా బీసీలకు న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

10వ తేదీన వైద్యులకు న్యూట్రిషన్‌పై శిక్షణ

పంజగుట్ట: ఇటీవలి కాలంలో ప్రతి ఒక్కరికీ డయాబిటిస్, బీపీ, కొలెస్ట్రాల్ లాంటి ఆరోగ్య సమస్యలు ఉంటున్నాయని వీటన్నింటికీ కారణం సరైన న్యూట్రిషన్ ఫుడ్ లేకపోవడమే అని ఫిజీషియన్ అసోసియేషన్ ఆఫ్ న్యూట్రిషన్ నిర్వాహకులు డాక్టర్ రాజేందర్ అన్నారు. తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన బంజారాహిల్స్‌లోని హోటల్ రాడిసన్‌బ్లూలో వైద్యులకు, మెడికల్ ప్రొఫెషనర్ లకు న్యూట్రిషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ అమృతతో కలిసి ఆయన మాట్లాడుతూ... ముందుగా వైద్యులకు న్యూట్రిషన్‌పై శిక్షణ ఇస్తే వారు వారివద్దకు వచ్చే రోగులకు సరైన భోజనం తీసుకోవాలని సలహాలు ఇస్తారన్న ఆలోచనతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కరోనా తరువాత ఆరోగ్యంపై ప్రతిఒక్కరికీ అవగాహన పెరగడం ఆనందమని, కానీ ఎలాంటి శిక్షణ లేనివారు కూడా ఇదితింటే మంచిది, అదితింటే మంచిదని చిట్కాలు ఇస్తున్నారని ఇది బాధాకరమైన విషయం అన్నారు.

రేపు ‘ఫెర్టీ 9 బేబీ మీట్’

పంజగుట్ట: సంతాన సాఫల్య చికిత్స ద్వారా పిల్లలు కన్న తల్లిదండ్రులు, పిల్లలతో ఈ నెల 9వ తేదీన బేగంపేటలోని హోటల్ గ్రాండ్ కాకతీయాలో ‘ఫెర్టీ 9 బేబీ మీట్’ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఫెర్టీ 9 మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సి.జ్యోతి తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ లోగోను డాక్టర్ శశిప్రియ, డాక్టర్ మౌనిక, డాక్టర్ ఇంద్రజిత్‌తో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీనటి స్నేహ హాజరవుతారన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఉచిత కన్సల్టెన్సీ, ఉచిత అల్ట్రాసౌండ్ స్కాన్, ఏఎంహెచ్ టెస్ట్, అండాశయ నిల్వ కీలక సూచిక, సంతానోత్పత్తి సామర్థ్యాన్ని అంచనా వేసే పరీక్షలు, పురుషుల వంధ్యత్వ పరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే తిరుపతి, రాజమండ్రి, బంజారాహిల్స్, కర్నూలులో కొత్త సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అంచనాలకు అందని లష్కర్ పోలింగ్!



- కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో అంతర్మథనం
- విశ్లేషణలో ఇరు పార్టీల నేతలు
- అన్ని డివిజన్లలో బీఆర్‌ఎస్‌దే హవా

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలోని పోలింగ్ తీరుపై కాంగ్రెస్, బీజేపీ నాయకులు అంతర్మథనం చేస్తుకుంటున్నారు. ఫలితాల లెక్కలు ముందేసుకుని ఆశించిన ఓట్లు రాకపోవడానికి గల కారణాలు విశ్లేషిస్తున్నారు. గత జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పోలైన ఓట్ల ధీమాతోనే ఎన్నికల బరిలోకి దిగిన బీజేపీకి ఎమ్మెల్యే ఎన్నికల్లో తీరని నష్టం జరిగింది. ప్రభుత్వ వ్యతిరేకత తమకు కలిసి వస్తుందని భావించిన కాంగ్రెస్ నాయకులకు కూడా చుక్కెదురైంది. అటు రాష్ట్రంలో రెండు మార్లు బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై వ్యతిరేకత, ఇటు రెండుమార్లు టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగిన పద్మారావుగౌడ్ వైఫల్యాలు తమకు కలిసి వస్తాయని కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు భావించినా ఫలితాలు మాత్రం వారి అంచనాలకు దూరంగా ఉండటంతో ఇరు పార్టీల నాయకులు జీర్ణంచుకోలేక పోతున్నారు.

పడిపోయిన బీజేపీ గ్రాఫ్..

గత జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు కార్పొరేటర్లుగా గెలవలేక పోయినా బీఆర్‌ఎస్ అభ్యర్థులకు గట్టిపోటీ ఇచ్చారు. అడ్డగుట్ట, తార్నాక డివిజన్లలో బీఆర్‌ఎస్ అభ్యర్థులు కొంతమేర మెజారిటీ సాధించారు. మెట్టుగూడ, సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ మూడు డివిజన్లలో స్వల్ప మెజారిటీతోనే బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. మొత్తంగా 2021 జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ఐదు డివిజన్లలో కలిపి బీఆర్‌ఎస్ అభ్యర్థులకు 59225, బీజేపీ అభ్యర్థులకు 47261 ఓట్లు పోలయ్యాయి. బీజేపీ కన్నా నియోజకవర్గం మొత్తం మీద బీఆర్‌ఎస్‌కు 11964 ఓట్లు మాత్రమే ఆధిక్యం వచ్చింది. తాజా ఎమ్మెల్యే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు 78223 ఓట్లు పోలవగా బీజేపీ అభ్యర్థి మేకల సారంగపాణికి 25203 మాత్రమే పోలయ్యాయి. జీహెచ్‌ఎంసీ ఎన్నికలతో పోల్చితే లష్కర్‌లో బీజేపీ గ్రాఫ్ సగానికి పడిపోవడానికి గల కారణాలను ఆ పార్టీ నాయకులు విశ్లేషిస్తున్నారు.

ఓటు బ్యాంకు పదిలం....

కాంగ్రెస్ పార్టీ విజయానికి వస్తే 2018 శాసనసభ ఎన్నికల్లో ఆ పార్టీకి వచ్చిన ఓట్లు ఈ ఎన్నికలోనూ పదిలంగా ఉన్నాయి. అప్పటి ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌కు ప్రత్యర్థిగా కాంగ్రెస్ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్ పోటీ చేసిన ఆయనకు 33839 ఓట్లు పోలయ్యాయి. తాజా శాసనసభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థి ఆదం సంతోష్‌కుమార్‌కు కూడా ఈ మారు 32983 ఓట్లు పోలయ్యాయి. గత జీహెచ్‌ఎంసీ ఎన్నికల గెలుపు ఆశలు లేక నామమాత్రపు అభ్యర్థులను బరిలో నిలిపిన కాంగ్రెస్ నాయకులు ఈమారు మాత్రం విజయం తమమేనన్న ధీమాతో ఎన్నికల ప్రచారం చేశారు. గత ఎన్నికలకు ఈ ఎన్నికలకు ఒకే విధంగా ఓట్లు పోలవ్వడం, కాంగ్రెస్ ఓటింగ్ శాతం పెరగకపోవడం పట్ల ఆ పార్టీ నాయకులే ముక్కున వేలేసుకుంటున్నారు.

రౌండ్ రౌండ్‌కూ మెజారిటీ..

తాజా శాసనసభ ఎన్నికల్లో మరోమారు బీఆర్‌ఎస్ తన సత్తా చాటుకుంది. ఓట్ల లెక్కింపులో 1వ రౌండ్ మొదలు 14 వ రౌండ్ వరకు ఓట్ల లెక్కింపులో బీఆర్‌ఎస్‌కు భారీ ఆధిక్యత లభించింది. ప్రతీ రౌండ్‌కు రెండు, మూడు వేల ఆధిక్యత చొప్పున మొత్తంగా 45240 ఓట్ల ఆధిక్యతను బీఆర్‌ఎస్ చేజిక్కించుకుంది.

డివిజన్	బీఆర్‌ఎస్	కాంగ్రెస్	బీజేపీ	మెజారిటీ
1.అడ్డగుట్ట	16671	7038	3078	9633
2.మెట్టుగూడ	10703	5725	3634	4978
3.తార్నాక	16830	8734	5618	8096
4.సీతాఫల్‌మండి	19566	6556	7365	13010
5.బౌద్ధనగర్	14031	4580	5195	9451
మొత్తం	78223	32983	25201	45240

2018 పోలింగ్		2023 పోలింగ్	
బీఆర్‌ఎస్	79309	బీఆర్‌ఎస్	78223
కాంగ్రెస్	33839	కాంగ్రెస్	32983
బీజేపీ	11781	బీజేపీ	25202

అందుబాటులో ఉంటా.. సమస్యలు పరిష్కరిస్తా



ఎమ్మెల్యే తలసానికి శుభాకాంక్షలు తెలుపుతున్న మహిళలు



అగ్ని ప్రమాదం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న తలసాని

సనత్‌నగర్: తనపై నమ్మకం ఉంచి మూడోసారి భారీ మెజారిటీతో గెలిపించిన నియోజకవర్గ వాసులకు నిరంతరం అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు.నియోజకవర్గ పరిధిలో వివిధ ప్రాంతాలకు చెందిన వారు గురువారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఆయన నివాసానికి వచ్చి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పద్మారావునగర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ అడ్వైజర్ చంద్రశేఖర్, అధ్యక్షులు రణవీర్, సభ్యులు శ్రీధర్, కృష్ణయాదవ్, సుదర్శన్‌రెడ్డి, కుషాల్, బన్సీలాల్‌పేట జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీ అధ్యక్షులు సిద్ధయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీలత ఆధ్వర్యంలో కాలనీవాసులు, బన్సీలాల్‌పేట రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఫహీం, ఉపాధ్యక్షుడు ప్రేమ్, భాగ్యమ్మ, కమల్‌కుమార్, అమీర్‌పేట టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళి, బాబ్జీ, ప్రసాద్, బల్కంపేట ఎల్లమ్మ దేవాలయ కమిటీ సభ్యులు యాదగిరి, నాగమణి తదితరులు తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బాధితులకు పరామర్శ..

రాంగోపాల్‌పేట డివిజన్ వెంగళరావునగర్‌లోని అంగన్‌వాడీ టీచర్ రమను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ గురువారం పరామర్శించారు. ఈ నెల 5వ తేదీన రమ నివాసంలో విద్యుదాఘాతంతో ఇంట్లోని సామగ్రి పూర్తిగా కాలిపోయి నిరాశ్రయులయ్యారు. విషయం తెలుసుకున్న ఆయన బాధితురాలు నివాసం, స్వల్పంగా దెబ్బతిన్న పక్కనే ఇళ్లను సందర్శించి పరామర్శించారు. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పిందని స్థానికులు వివరించారు. బాధిత కుటుంబాలకు వ్యక్తిగతంగా ఆర్థిక సహాయం అందజేశారు. మాజీ కార్పొరేటర్ అరుణగౌడ్, కిరణ్మయి,శ్రీనివాస్‌గౌడ్, శ్రీహరి, కిషోర్, బస్తీవాసులు మల్లేష్, ఝాన్సీ, ఆషారాణి, రాజు, నర్సింగ్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.15, నల్లవంకాయ 23, పాడుగు వంకాయ 23 బెండకాయ 45, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 85, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరి బీర 40, క్యాబేజీ 11, క్యారెట్ 25, దొండ 35, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 45, గోకరకాయ 35, కీర 20, దోసకాయ 25, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 38, ఆలుగడ్డ 23, చామగడ్డ 40, మొరంగడ్డ 18, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 15, అరటికాయ 9, మునగకాయ 4-6, ముల్లంగి 4-6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

నేడు ఐఐసిటీ ఆడిటోరియంలో సైన్స్, ఇండస్ట్రీ సదస్సు

లాలాపేట: తార్నాకలోని ఐఐసిటీ ఆడిటోరియంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు సైన్స్, ఇండస్ట్రీ, సొసైటీ అనే అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహిస్తున్నట్లు సీసీఎంబి డైరెక్టర్ డాక్టర్ వినయ్‌కే నందికూరి గురువారం ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు. ఐఎస్ఎస్ఏ 89వ వార్షిక జనరల్ బాడీ సమావేశాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ సదస్సులో ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ప్రసిడెంట్ అశుతోష్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సదస్సులో మరో 8 మంది సైంటిస్టులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ప్రగతి భవన్‌కు జ్యోతిరావ్ పూలే నామకరణం పట్ల హర్షం

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రగతి భవన్‌కు మహాత్మాజ్యోతి రావ్ పూలే పేరు పెట్టడం పట్ల బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయానికి యావత్ బీసీల తరపున ధన్యవాదలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. బీసీ సమస్యల పరిష్కారానికి మహాత్మా జ్యోతి బాపూలే ప్రజా భవన్ వేదిక కావాలని లింగంగౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

28 నుంచి డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో ఈ నెల 28 నుంచి వివిధ డిగ్రీ కోర్సుల మొదటి సంవత్సరం రెగ్యులర్ విద్యార్థుల ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షల టైంటేబుల్, ఇతర వివరాలను ఓయూ వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా డిగ్రీ కోర్సుల ఫస్ట్ సెమిస్టర్ పరీక్ష ఫీజు గడువును ఈ నెల 8 వరకు, రూ.500 అపరాధ రుసుంతో 13 వరకు పొడిగించినట్లు తెలిపారు.

జలసౌధలో సంబరాలు

పంజగుట్ట: రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రిగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో ఎర్రమంజిల్‌లోని జలసౌధలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ సంబరాలు చేసుకొని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుని ఆనందం వ్యక్తం చేశారు. అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎల్.నాగరాజు మాట్లాడుతూ... త్వరలోనే మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపి తమ సంపూర్ణ మద్దతు ఇస్తామన్నారు. రెండేళ్లుగా ఆగిన పదోన్నతులు, మూడు సంవత్సరాలుగా చెల్లించని టీఏ బిల్లులు, నిలిచిపోయిన ఏహెచ్ఏఆర్, కొన్ని చోట్ల నిలిచిపోయిన హెచ్ఆర్ఏ, ఇతర సమస్యలను మంత్రికి వివరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి సంతోష్‌రెడ్డి, ముఖ్య సలహాదారు కుడుముల బుచ్చయ్య, గౌరవాధ్యక్షుడు వేదగిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చుతా



పుష్పగుచ్ఛం అందిస్తున్న బస్తీవాసులు

బన్సీలాల్‌పేట్: ప్రజలకిచ్చిన హామీలన్నీ నెరవేర్చుతానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం పలు బస్తీలు, కాలనీలు, వాకర్స్ ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. బన్సీలాల్‌పేట్ జేఎస్ఎన్‌యూఆర్ఎం బస్తీ, పద్మారావునగర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. అధికారంతో నిమిత్తం లేకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. తనపై నమ్మకంతో ఓటేసి గెలిపించిన ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు. సిద్ధయ్య, శ్రీలత, రాజు, శ్రీనివాస్, శ్రీరాములుతో పాటు రణవీర్, క్రిష్ణయాదవ్, లింగం, శ్రీధర్, గిరి, సుదర్శన్‌రెడ్డి, కుషాల్ పాల్గొన్నారు.

అంధకారం.. అధికారులు స్పందించరేం.?



లాలాపేట: తార్నాక డివిజన్ ఆర్యనగర్‌లో గత కొన్ని రోజుల నుంచి స్ట్రీట్ లైట్స్ వెలగడం లేదు. గత ఎన్నికల సమయం నుంచి ఆర్యనగర్‌లో రాత్రి వేళల్లో పూర్తిగా అంధకారం అలుముకుంది. రాత్రి సమయంలో స్థానికులు, మహిళలు, చిన్నారులు ఇంట్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొందని ఈ సమస్యపై సంబంధిత అధికారులతో మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. సీసీ రోడ్డు నిర్మాణం కోసం తవ్వి వదిలేసిన గుంతలమయమైన రోడ్లపై నుంచి వెళుతూ ద్విచక్ర వాహన దారులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఉన్నతాధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

‘నిమ్స్’ కొత్త చైర్మన్‌గా సీఎం రేవంత్‌రెడ్డి

- మొదటి నుంచి సీఎం చైర్మన్‌గా వ్యవహరిస్తున్న వైనం
- శుభాకాంక్షలు తెలిపిన నిమ్స్ ఉద్యోగ సంఘాలు



లక్డీకాపూల్: నిజామ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) నూతన చైర్మన్‌గా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వ్యవహరించనున్నారు. ఇక నుంచి నిమ్స్ గవర్నింగ్ కౌన్సిల్ అధ్యక్షుడిగా సీఎం రేవంత్ కొనసాగుతారు. బొక్కల దవాఖానా నుంచి నిజాం వైద్య విజ్ఞాన సంస్థగా ఎదిగిన మొదలు నిమ్స్ చైర్మన్‌గా రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవహరిస్తూ వస్తున్నారు. అదే క్రమంలో గురువారం రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డి నిమ్స్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. సీఎంతో పాటు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా నిమ్స్ గవర్నింగ్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు. ఈయన నిమ్స్ ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యులుగా కొనసాగనున్నారు. ఇప్పటి వరకు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్, మాజీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న తన్నీరు హరీష్‌రావులు గవర్నింగ్ కౌన్సిల్ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ క్రమంలో నిమ్స్ పారా మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ శిరందాస్, నిమ్స్ నాన్ ఫ్యాకల్టీ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యగౌడ్, సురేష్ బాబులు కొత్త సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. సీఎం రేవంత్ హయాంలో ఆస్పత్రి విస్తరణ అభివృద్ధి జరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

100 ఏళ్లు దాటిన సామాన్యుడి సంత!



- శతాబ్దానికి పైగా చరిత్ర కలిగిన ఎర్రగడ్డ మార్కెట్
- కాలనీల్లోకి చొచ్చుకురావడంతో ఇక్కట్లు

సనత్‌నగర్: సామాన్యుడికి ఆ సంతతో సంతోషం.. మధ్య తరగతిని మరిపించే ఓపెన్ మాల్.. ఇక శ్రీమంతులకు అదో ఆటవిడుపు. ఆదివారం సూర్యోదయం కాకమునుపే ‘గిట్టుబాటు’ అంకెలను గుక్క తిప్పుకోకుండా పలకడంలో అక్కడ వ్యాపారులు పోటీ పడుతుంటారు. ఆ రోజు అందరికీ సెలవు. కానీ వారికి ఈ సెలవు రోజే బతుకుదారం. పొద్దస్తమానం వారు పెట్టే ‘రేటు’ కేకలే వ్యాపారానికి మలుపులు. ఇదీ ఎరగడ్డ ఆదివారం అంగడి పరిస్థితి. శతాబ్దం కాలం క్రితం 15–20 దుకాణాలతో మొదలైన సంత నేడు దాదాపు వెయ్యి మంది చిరువ్యాపారులకు బతుకుకేంద్రంగా మారింది. రోడ్డే ఈ సంతకు అడ్డ. నాడు ఎర్రగడ్డ చౌరస్తాకే పరిమితమైన వ్యాపారాలు నేడు కిలోమీటరు పొడవునా విస్తరించాయి. చౌరస్తా నుంచి మొదలుకొని సనత్‌నగర్ బస్టాండ్ వరకు విస్తరించాయి.

సకల వస్తువుల కేంద్రంగా..

చిన్నా పెద్దా మాల్ అని తేడా లేదు. వాటిల్లో ఉండే ప్రతి వస్తువూ ఇక్కడ లభ్యమవుతోంది. స్క్రూడ్రైవర్ నుంచి షూష్, రెడీమేడ్ దుస్తుల నుంచి రేబాన్‌గ్లాసెస్ వరకు, వంటింటి పాత్రల నుంచి వయ్యారాలు ఒలకబోసే అందమైన ఆటబొమ్మలు, ఆనాటి గ్రామఫోన్ల నుంచి నేటి స్మార్ట్‌ఫోన్లు, పెంపుడు పిల్లుల నుంచి మేకలు, గొర్రెల వరకు ఇలా ప్రతిదీ ఈ సంతలో దొరుకుతోంది. ముఖ్యంగా ప్రతినిత్యం ఇంట్లో ఉపయోగించే వస్తువులకు ఈ మార్కెట్ కేరాఫ్‌గా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఎర్రగడ్డ–సనత్‌నగర్ మార్గం ఇసుకేస్తే రాలనంతా జనంతో నిండిపోతోంది.



ఫోన్ల విడిభాగాలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

‘సెకండ్స్’కు పెట్టింది పేరు..

ఎర్రగడ్డ సంత అంటే వస్తువులు ‘సెకండ్స్’లో అమ్ముడు పోతాయన్నది వ్యాపార వర్గాలతో పాటు వినియోగదారుల మాట. షర్టులు, ప్యాంట్లు, గొడుగులు, సీడీలు, ఎలక్ట్రికల్, ఐరన్ ఇలా ఎన్నో రకాల వస్తువులు సెకండ్‌హ్యాండ్స్‌లో లభిస్తున్నాయి. ఇక ప్రొక్లేన్ నుంచి మొబైల్ ఫోన్ వరకు ఎలాంటి యంత్రాలు, వస్తువులుకు కావాల్సిన విడిభాగాలు (స్పేర్‌పార్ట్స్)కు ఈ సంతే చిరునామా. అందుకే ఎర్రగడ్డ సంతకు అంత క్రేజ్. తక్కువ ధరకే తమకు కావాల్సిన వస్తువు దొరుకుతుండడంతో వినియోగదారులు ఈ సంత బాట పడుతుంటారు. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, మియాపూర్, అమీర్‌పేటల నుంచే కాకుండా నగరం నలుమూలల నుంచి ఈ మార్కెట్‌ను సందర్శించి తమకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసుకుంటారు. ప్రతివారం దాదాపుగా 30 నుంచి 40 వేల మంది వినియోగదారులు ఈ మార్కెట్‌ను సందర్శిస్తుంటారని అంచనా.



వందేళ్ల చరిత్రకు సాక్ష్యంగా..

రాజులు పోయారు..రాజ్యాలు పోయాయి...కానీ వందేళ్ల సాక్ష్యానికి ఇక్కడ మార్కెట్ సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. గత దశాబ్దన్నర క్రితం వరకు పశువుల సంత కూడా ఇక్కడే జరిగేది. వివిధ జిల్లాల నుంచి విభిన్న జాతుల ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలను తీసుకువచ్చి క్రయ విక్రయాలను జరుపుతుండేవారు. అయితే పెరిగిన ట్రాఫిక్ దృష్ట్యా ఇక్కడి పశువులను సంతను మోతీనగర్ సమీపంలోని బబ్బుగూడకు తరలించారు. సాధారణ మార్కెట్ మాత్రం ఇక్కడే కొనసాగుతోంది.

సీజనల్ వ్యాపారాలకు..

చలికాలం మొదలైంటే ఇక్కడ స్వెట్టర్లను అమ్మకాలు భారీగా జరుగుతాయి. కల్లంలో ధాన్యపు రాశులు పోసినట్లుగా రోడ్డుపై స్వెట్టర్లతో పాటు విభిన్న రకాల మంకీ క్యాప్‌లు, చలికి చెక్‌పెట్టే ఉన్ని దుస్తుల విక్రయాలు కొనసాగిస్తుంటారు. ఇక వర్షాకాలం వచ్చిందంటే రెయిన్ కోట్లు, కళ్ల జిగేల్‌మనిపించే కలర్స్‌లో గొడుగులు ఈ మార్కెట్‌ను ముంచెత్తు తాయి. ఇక ఎండాకాలం వచ్చిందంటే కాటన్ దుస్తులు ఎక్కువగా దిగుమతి చేసుకుని అమ్మకాలు సాగిస్తారు.

స్థానికుల నుంచి వ్యతిరేకత..

సంత కారణంగా రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉంటుందని పలు కాలనీవాసుల నుంచి చిరువ్యాపారులకు చుక్కెదురవుతోంది. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ముఖ్యంగా రోడ్డును ఆనుకుని ఉన్న జెక్‌కాలనీ, ఎస్ఆర్‌టీకాలనీవాసులు సంతలోని చిరువ్యాపారులతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నామన్నది వారి వాదన. ముఖ్యంగా జెక్‌కాలనీ రోడ్ల పైకి వ్యాపారులు రావడంతో అంబులెన్స్ ఫైరింజన్‌వంటి అత్యవసర సేవలు అందించే వాహనాలు రావాలన్నా ఇబ్బందికరంగా ఉంటుందని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీ రోడ్ల పైకి రాకుండా అంగడి వ్యాపారాలు కొనసాగించుకోవాలని వారు పోరాడుతూ వస్తున్నారు. వ్యాపారాలకు నష్టం లేకుండా.. జెక్‌కాలనీ రోడ్ల పైకి వ్యాపారాలు చొచ్చుకు రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని వారు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

అనుమానాస్పదంగా విజయ డెయిరీ కార్మికుడి మృతి

- అపస్మారక స్థితిలో మరో కార్మికుడు
- మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన



లాలాపేట: విజయ డెయిరీలో నైట్ డ్యూటీలో ఉన్న ఓ కార్మికుడు అనుమానాస్పదంగా మృతి చెందగా మరో కార్మికుడు అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్న ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అంజనేయులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రానికి చెందిన మనోజ్‌కుమార్ (30) పదేళ్లుగా క్యాప్సన్ మ్యాన్‌పవర్ ఏజెన్సి ద్వారా ఫైర్‌మెన్‌గా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విజయ డెయిరీలో బ్రాయిలర్ యూనిట్‌లో విధులు నిర్వహిస్తున్నారు. రోజు మాదిరిగా బుధవారం రాత్రి 10 గంటల నైట్ షిఫ్ట్‌లో తోటి కార్మికుడు శంకర్ (33)తో కలిసి పనిలో చేరారు. నైట్ డ్యూటీ విధులు ముగించి డెయిరీ ఆవరణలో ఉన్న ఓ గదిలో ఇద్దరూ నిద్రిస్తుండగా అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఉదయం విధులకు హాజరైన కార్మికులు వారిని గమనించగా వారి నోటి నుంచి నురగలు వస్తుండటంతో గాంధీ హాస్పిటల్‌కు తరలించగా మనోజ్‌కుమార్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శంకర్ చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న ఏసీపీ సైదయ్య ఘటనా స్థలానికి చేరుకుని తోటి కార్మికుల నుంచి వివరాలను సేకరించారు. దోమల బెడదకు ఏర్పాటు చేసిన పొగతో ఉక్కిరిబిక్కిరై మరణించి ఉండొచ్చని.. నోట్లో నురగను చూసి పాము కాటుకు గురై ఉండొచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బిహార్ నుంచి పొట్టకూటి కోసం నగరానికి వచ్చిన మనోజ్‌కుమార్‌కు భార్య ఇద్దరు ఐదేళ్ల లోపు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం అతని భార్య గర్భవతి. మనోజ్ మృతితో కుటుంబం రోడ్డున పడింది.

మృతదేహంతో ఆందోళన..



మనోజ్‌కుమార్ మృతదేహంతో గురువారం రాత్రి విజయ భవన్ ముందు కుటుంబ సభ్యులు, తోటి కార్మికులు ధర్నా చేపట్టారు. కార్మికుడి ప్రాణం పోయినా సదరు కాంట్రాక్టర్ రాకపోడంపై కార్మిక సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని బీహార్‌కు తీసుకెళ్లేందుకు కనీసం అంబులెన్స్ ఖర్చులు కూడా ఇవ్వకపోడం దారుణం అన్నారు. కార్మికులంతా కలిసి పాల సరఫరా వాహనాలను కాసేపు నిలిపివేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను శాంతింపజేశారు.